క్లుప్తంగా

దత్త క్రియా యోగ శిక్షణ ప్రారంభం



దత్త క్రియా యోగ శిక్షణలో పాల్గొన్న ప్రజలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో నాలుగు రోజులు పాటు నిర్వహించనున్న ఉచిత దత్త క్రియ యోగా శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. అవధూత గణపతి సచ్చిదానంద స్వామి వద్ద దత్త క్రియ యోగాలో శిక్షణ పొందిన వేణుగోపాల్ శిక్షణలో భాగంగా మనిషి మానసిక ఒత్తిడిని జయించే ధ్యాన హస్త ముద్రలు, శ్వాస మీద ధ్యాస, నాడీ శుద్ధి వ్యాయామాలు, సూర్య నమస్కారాలు, ఆసనాలు, ప్రాణాయామం వంటి పలు యోగా అంశాలను వివరించారు. హాజరైన వారికి శిక్షణనిచ్చారు. అనంతరం వారికి ఆహార నియమాలను వివరించారు. నాలుగు రోజులు పాటు నిర్వహించనున్న ఈ దత్త క్రియ యోగా శిక్షణ మనిషి జీవన విధానానికి ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు బీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, సభ్యులు టీ. లోకేష్, ప్రముఖ వైద్యులు శానం విజయ మోహన్ రావు పాల్గొన్నారు.

భావోద్వేగాలు పలికించడం మాతృభాషతోనే సాధ్యం



క్విజ్ పోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న డిగ్రీ కళాశాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏ వ్యక్తి అయినా తనలోని భావోద్వేగాలను పలికించడం మాతృ బాషతోనే సాధ్యమని డిగ్రీ కళాశాల అధ్యాపకుడు ఎస్.పరమేశ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ జీ. గిరిబాబు మాట్లాడుతూ విద్యా బోధనకు, అభ్యసనానికి మాతృభాషకు మించిన సాధనం లేదన్నారు. ఆంగ్ల ఉపన్యాసకులు వీ. వెంకట్రావు మాట్లాడుతూ మాతృభాష పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సీహెచ్ ఉదయలక్ష్మి, ఎం. రాంబాబు, టీవీఎస్ పద్మావతి, పీవీ దుర్గా ప్రసాద్, ఎం. కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు

- సీఎం జగన్‌తోనే సంక్షేమ రాజ్యం సాధ్యం
- ఏలూరులో 1,87,754 మందికి లబ్ధి
- ఐదేళ్లల్లో డీబీటీ ద్వారా రూ.447.49 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ
- ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ళ నాని
- గడపగడపకు వెళ్లి పథకాల అమలుపై ఆరా



ఏలూరులో గడపగడపకు కార్యక్రమంలో ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ళ నాని (ఫైల్)



వృద్ధురాలి సమస్యను విని పరిష్కారానికి అధికారులను ఆదేశిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ళ నాని (ఫైల్)

ఏలూరు టౌన్: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేయడంతో పాటు దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ రాజ్యాన్ని ఆవిష్కరిస్తూ ప్రజల హృదయాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తనదైన ముద్ర వేసుకున్నారు. ఏలూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన ఐదేళ్ల కాలంలో నవరత్నాలను పక్కాగా అమలు చేస్తూ పేదల కుటుంబాల్లో సంక్షేమ వెలుగులు నింపారు. ఐదేళ్లలో ఏలూరు నియోజకవర్గంలో సంక్షేమ పథకాల రూపంలో రూ.447 కోట్లకుపైగా పేద, మధ్యతరగతి వర్గాలకు లబ్ధి చేకూర్చడం చరిత్రలో నిలిచిపోయే అంశం. ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ళ నాని సారథ్యంలో ఏలూరులోని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించారు.

ఐదేళ్లలో రూ.447.49 కోట్ల లబ్ధి

ఏలూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఎమ్మెల్యే ఆళ్ళ నాని నాయకత్వంలో భారీ ఎత్తున పేద వర్గాలకు సంక్షేమ పథకాల రూపంలో లబ్ధి చేకూరింది. ఐదేళ్ల కాలంలోనే రూ. 447,49,81,158 సొమ్ము ప్రజలకు నేరుగా వారి ఖాతాల్లోకే చేరడం విశేషం . ఏలూరులో 90,249 గృహాలుండగా ఆయా కుటుంబాల్లో 1,87,754 మందికి సంక్షేమ పథకాలు అందాయి. వారిలో ప్రధానంగా డ్వాక్రా సంఘాల అక్కచెల్లెమ్మలకు జగనన్న ఆసరా రూపంలో 32,672 మందికి రూ. 84,02,58,231 సొమ్ము వారి ఖాతాల్లో జమ చేశారు. ఇక తమ పిల్లల చదువులకుగానూ అమ్మ ఒడి రూపంలో 23,703 మంది తల్లుల ఖాతాల్లో రూ.64,21,20,000 వేశారు. ఇక వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పెన్షన్ రూపంలో 29,534 మందికి రూ. 8,93,31,500 ప్రతి నెల 1వ తేదీన అందజేస్తూ అండగా నిలిచారు.

అన్ని వర్గాలకు పథకాలు

ఏలూరు నియోజకవర్గంలో ఆసరా, అమ్మ ఒడి, చేదోడు, పంటల బీమా, ఈబీసీ నేస్తం, పెన్షన్లు , కల్యాణమస్తు, కాపు నేస్తం, జగనన్న విద్యా దీవెన, లా నేస్తం, మత్స్యకార భరోసా, రైతు భరోసా, జగనన్నతోడు, వాహన మిత్ర, వైఎస్సార్ ఆరోగ్య ఆసరా, వైఎస్సార్ బీమా, వైఎస్సార్ చేయూత ఇలా అనేక పథకాలు ప్రజలకు అందించడంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సక్సెస్ అయింది. వీటితో పాటు అత్యంత ప్రాముఖ్యతమైన పేద వర్గాలకు గూడు కల్పించేందుకు ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళ నాని ప్రత్యేక శ్రద్ధతో 29,592 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు.

మాది సంక్షేమ ప్రభుత్వం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల ప్రభుత్వంగా సంక్షేమ రాజ్యంగా పేరు తెచ్చుకుంది. పేద, మధ్య తరగతి వర్గాలకు మేలు చేసేలా ఈ ఐదేళ్ల కాలంలో డీబీటీ ద్వారా రూ. వందల కోట్లు నేరుగా లబ్ధిదారులకు సొమ్ములు అందజేశారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళ నాని సహకారంతో ఏలూరు నగరంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నాం.

– షేక్ నూర్జహాన్, ఏలూరు నగర మేయర్

ఎమ్మెల్యే నాని హయాంలోనే అభివృద్ధి



ఏలూరు నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళ నాని ప్రజలకు సేవ చేస్తున్నారు. ఏలూరు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వందల కోట్లతో అభివృద్ధి పనులు చేస్తూ, సంక్షేమాన్ని సైతం విస్మరించకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలను అందించేందుకు కృషి చేస్తున్నారు. గడపగడపకూ వెళ్లి పథకాల అమలు తీరును తెలుసుకుంటూ లోపాలను సరిచేసేందుకు చర్యలు చేపట్టారు.

– నిడికొండ నరేంద్ర, వైఎస్సార్ సీపీ నగర యువజన అధ్యక్షుడు

పోలీస్ సిబ్బందికి అండగా ఉంటాం

ఏలూరు జిల్లా ఎస్పీ మేరి ప్రశాంతి



హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం అందచేస్తున్న ఎస్పీ మేరి ప్రశాంతి

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలోని పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తాము ఎల్లప్పుడూ ముందుంటామని పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరిప్రశాంతి తెలిపారు. ఏలూరు జిల్లా హోంగార్డు యూనిట్‌లో పనిచేస్తోన్న వై.లక్ష్మణరావు అనారోగ్య కారణాలతో మరణించారు. ఆయన తల్లి నాగమణికి హోంగార్డు సంక్షేమ నిధి నుంచి రూ. 5,44,990 చెక్కును ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి తాము అండగా ఉంటామని, ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

అధికారులతో జేసీ సమీక్ష

దెందులూరు: వచ్చే ఎన్నికల్లో అన్ని శాఖల అధికారులు భారత ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలని జేసీ బీ.లావణ్యవేణి అన్నారు. బుధవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలో అన్ని శాఖల మండలాధికారులతో ఎన్నికలకు సంబంధించి సూచనలు, సలహాలు తెలియజేసి, నిబంధనలు వివరించారు. ఎన్నికల కోడ్ ప్రకటించిన వెంటనే అప్రమత్తం కావాలన్నారు. దెందులూరు తహసీల్దార్ వీ.జితేంద్ర ఉన్నారు.

తెలుగు భాష గొప్పదనాన్ని చాటాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తెలుగు భాష గొప్పతనాన్ని నేటి తరాలవారికి తెలియజేయాల్సిన అవసరం మనందరిపై ఉందని హిందూ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక వైఎంహెచ్‌ఏ హాలు ప్రాంగణంలోని తెలుగుతల్లి విగ్రహానికి సంస్థ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు అంబికా రాజా, కార్యనిర్వాహక కమిటీ ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు పూలమాలలతో అలంకరించి మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రపంచ భాషలందు తెలుగు భాష లెస్స అని పలికిన శ్రీకృష్ణదేవరాయలు స్ఫూర్తిని, కొనసాగించాలన్నారు. యర్రా సోమలింగేశ్వరరావు మాట్లాడుతూ భాష, సాంస్కృతిక కళలను ముందు తరానికి తీసుకెళ్లడానికి హిందూ యువజన సంఘం ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన నాట్యాచారిణి పార్వతి రామచంద్రన్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, కేబీ రావు, సీహెచ్ సాయి తేజ, ఎంవీవీఎస్ నాగేశ్వరరావు, లంకా వెంకటేశ్వర్లు, రేవూరి శివ శంకర ప్రసాద్, గుడిపాటి లలితా శర్మ, బొప్పన వెంకట రాజా, ఎం. సూర్యనారాయణ యాదవ్, కనిగోళ్ల హేమంత్ కుమార్, ఆరేపల్లి రవి ప్రకాష్ పాల్గొన్నారు.



తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసిన హిందూ యువజన సంఘం ప్రతినిధులు



కళాకారులను సన్మానిస్తున్న సాహిత్య మండలి, గరికపాటి ఆర్ట్స్ సంస్థల ప్రతినిధులు

అలరించిన పేరడీ పాటల కార్యక్రమం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన సాహిత్య మండలి, గరిక పాటు ఆర్ట్స్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మాతృభాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన తెలుగు పేరడీ పాటల కార్యక్రమం విశేషంగా అలరించింది. స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి భవనంలో నిర్వహించిన ప్రారంభ సభకు గరికపాటి కాళిదాసు అధ్యక్షత వహించి తెలుగు భాష గొప్ప తనాన్ని, భాష మాధుర్యాన్ని తెలియజేసారు. ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం ఏలూరు పట్టణ అధ్యక్షుడు కాకర్ల శ్రీను, స్నేహం అసోసియేషన్ అధ్యక్షుడు అంబికా రాజా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సభా వ్యాఖ్యాతగా గురు శర్మ కార్యక్రమాన్ని రక్తి కట్టిస్తూ పదిమంది కళాకారులతోపాటు ఒక పేరడీ పాటను పాడి ఆకట్టుకున్నారు. అంబికా రాజా, సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి పుల్లాభొట్ల పురుషోత్తం, సాహితీవేత్త గంగాధర చయనులు, శ్రీహరికోటి, ఎండీ ఖాజావలి హాజరయ్యారు. హేలాపురిలో మొట్టమొదటిగా ఈ రసవత్తర కార్యక్రమం నిర్వహించడం ఆనందదాయకంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. అనంతరం పేరడీ పాటలు పాడిన కళాకారులను ఘనంగా సత్కరించారు.

విలీన గ్రామాల ప్రజలకు ఉపాధి కల్పించాలి



పోణంగిలో ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించిన దృశ్యం

ఏలూరు రూరల్: ఏలూరు నగర కార్పొరేషన్‌లో విలీనమైన ఏడు గ్రామాల్లో ఉపాధి కూలీలకు ప్రభుత్వం పని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి రామకృష్ణ కోరారు. బుధవారం పోణంగిలో ఉపాధి హామీ పథకం కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల క్రితం ప్రభుత్వం వెంకటాపురం, సత్రంపాడు, చొదిమెళ్ళ, పోణంగి, కొమడవోలు, తంగెళ్లమూడి, శనివారపుపేట గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేసిందని గుర్తు చేసారు. ఈ కారణంతో కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎంఎస్ఆర్ఈజీఎస్ అధికారులు ఆయా గ్రామాల్లో కూలీలకు పని కల్పించడం లేదన్నారు. ఫలితంగా పేదలకు ఆయా ప్రాంతాల్లో ఉపాధి కరువై వలస పోతున్నారని అన్నారు. వలస పోలేని కొన్ని కుటుంబాలతో పాటు ఒంటరి మహిళలు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ సమస్యను జిల్లా అధికారులు రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి 7 గ్రామాల్లో కూలీలకు పని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. స్థానికరాలు జి దుర్గ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ప్రేమకుమారి, దేవమాత, పాప, వెంకటేశ్వరరావు, కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దళిత ఆదివాసీ మేనిఫెస్టోకు భరోసా ఇవ్వాలి



దళిత ఆదివాసీ మేనిఫెస్టో 2024 కాపీలను చూపుతున్న డీబీఆర్‌సీ నాయకులు

ఏలూరు (టూటౌన్): దళిత ఆదివాసీ మేనిఫెస్టో 2024కి అన్ని రాజకీయ పార్టీలు భరోసా కల్పించాలని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లాడి దేవకుమార్ కోరారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో దళిత గిరిజన బడ్జెట్ వాచ్ ఏలూరు జిల్లా విస్తృత సమావేశం బుధవారం స్థానిక లేడీస్ క్లబ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కన్వీనర్ దేవకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో దళిత ఆదివాసీల సమస్యలు, వారి అవసరాలపై విస్తృత సమావేశాలు నిర్వహించామన్నారు. ఈ సమావేశాలలో దళిత సంఘం నాయకులు, మేధావులు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు, విశ్రాంతి ఉద్యోగుల నుంచి తీసుకున్న అంశాలను దళిత గిరిజన బడ్జెట్ వాచ్ కమిటీలు దళిత ఆదివాసి మేనిఫెస్టో 2024ను పది అంశాలతో రూపొందించామన్నారు. ఈ అంశాలను అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో చేర్చాలని ఆయన కోరారు. ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు మేతర అజయ్ బాబు మాట్లాడుతూ గిరిజన, ఆదివాసీ ఆర్థిక అభివృద్ధికి అన్ని రాజకీయ పార్టీలు కృషి చేయాలన్నారు. డీబీఆర్‌సీ జిల్లా కన్వీనర్ సింగవరపు జ్యోతి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర దళిత, గిరిజన బడ్జెట్ వాచ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ రమణ మూర్తి దళిత ఆదివాసి మేనిఫెస్టోను ప్రదర్శించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు స్వచ్ఛంద సేవా సంస్థ సిబ్బంది, డీబీఆర్‌సీ సిబ్బంది గోసాల ఝాన్సీ రాణి, బలే సురేష్ తదితరులు పాల్గొన్నారు.

25న ఎలక్ట్రికల్ వర్కర్ల యూనియన్ రాష్ట్ర సమావేశం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం ఈ నెల 25న నిర్వహించనున్నట్లు ఆ సంఘ ప్రతినిధులు తెలిపారు. బుధవారం స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎలక్ట్రికల్ వర్కర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై ఈ సమావేశంలో చర్చిస్తామని, ఆయా సమస్యల పరిష్కారానికి తగిన ఉద్యమ కార్యాచరణ సమావేశంలోనే రూపొందిస్తామన్నారు. ఈ సమావేశంలో నగరంలోని ఇఫ్టూ కార్యాలయంలో 25వ తేదీ ఉదయం ప్రారంభమవుతుందన్నారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం బీటీసీ కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయాలని, బీటీసీ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, ఫించన్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర సర్వసభ్య సమావేశానికి సబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో లింగమల్లు శ్రీనివాసరావు, కే. రాజ్‌కుమార్, బీ. శ్రీనివాసరావు, మైచర్ల శంకర్రావు పాల్గొన్నారు.



రాష్ట్ర సర్వసభ్య సమావేశం వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	54	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	64
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	05, 07, 10
బెండకాయలు	50	కంద	64
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	42
కాకర కాయలు	50	కీరా దోస	34
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	84
కాలీఫ్లవర్	--	అల్లం	120
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	18
క్యారెట్	32-40	పాలకూర	10
దొండకాయలు	38	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	24-28	గోంగూర	08
గోరుచిక్కుడు	46	పుదీనా	05
దోసకాయలు	34-38	బఠాణీ	--
ఆనబకాయ (1)	30-35	క్యాప్సికమ్	74
పొట్లకాయ(1)	15-20	చిలకదదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	42
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	16
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	23
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	33

కొల్లేరు ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతం



రూ. 38 లక్షలతో పూర్తి చేసిన సచివాలయ భవనం



పెదయాగనమిల్లిలో రూ.21 లక్షలతో నిర్మించిన వైఎస్‌ఆర్ క్లినిక్ భవనం

ఏలూరు రూరల్: పెదయాగనమిల్లి మారుమూల కొల్లేరు గ్రామం. ఐదేళ్ల క్రితం వరకూ ఆసుపత్రికి లేదా ఉద్యోగ, విద్యావసరాలకు ఏలూరుకు పరుగులు తీయాల్సిందే. గోతులమయమైన మట్టి రోడ్లపై ప్రయాణం నరకప్రాయం. నేడు ఆ పరిస్థితి మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో గ్రామంలో అభివృద్ధి పరుగులు తీసింది. స్థానిక ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు అధికారులు రూ.60 లక్షలతో అధికారులు సీసీ రోడ్లు పనులు పూర్తి చేశారు. ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు పరివేక్షణలో రూ.38 లక్షలతో సచివాలయం, మరో రూ.21 లక్షలతో వైఎస్‌ఆర్ క్లినిక్ భవనాలు పూర్తి చేసారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి గడపగడపకు కార్యక్రమం పూర్తి చేయడంతో ప్రభుత్వం గ్రామాభివృద్ధి కోసం మరో రూ.20 లక్షలు మంజూరు చేయడంతో వాటితో అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి పనులపై సర్పంచ్ బలే నాగసులోచన, ఉప సర్పంచ్ సైదు విజయలక్ష్మితో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు బలే నాగరాజు గ్రామ పెద్దలు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో విద్య, వైద్యం, రోడ్లు, ప్రభుత్వ పాలన అంతా గ్రామానికే వచ్చాయని స్థానిక ప్రజలు సంబరపడుతున్నారు.

రైతు శుభ్ కరణ్ సింగ్ మృతిపై ఆందోళన

ఏలూరు (టూటౌన్): రైతులు పండించే పంటలకు మద్దతు ధరల చట్టం తీసుకురావాలని కోరుతూ రైతాంగం ఢిల్లీకి శాంతియుతంగా నిర్వహిస్తున్న ప్రదర్శనపై హర్యానా రాష్ట్రం కానూరి సరిహద్దులో పోలీసులు సాగించిన దుర్మార్గమైన దాడిలో రైతు శుభ్ కరణ్ సింగ్ (24) అనే యువ రైతు తీవ్రమైన గాయాలపాలై మృతి చెందడంపై ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ బుధవారం తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. రైతు ఉద్యమంపై మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న దుర్మార్గమైన వైఖరికి ఇది నిదర్శనమని ఆయన అన్నారు. యువ రైతు మృతికి కారణమైన పోలీసులపై చర్య తీసుకోవాలని రైతు సంఘం జిల్లా కమిటీ కోరింది. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మగడ్డ నర్సింహ, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.